VISION BHARATH REPORTER
విభారె
VIBHARE TELUGU DAILY
విలేఖరులు కావలెను
గత నాలుగు సంవత్సరాల నుండి వెలువడుతున్న "విభారె" తెలుగు దిన పత్రికకు కర్నూలు జిల్లాలోని అన్ని మండలాల వారీగా
అనుభవజ్ఞులైన రిపోర్టర్లు కావలెను.
ఆసక్తిగలవారు వెంటనే సంప్రదించగలరు.
ఆవుల విజయభాస్కర్ రెడ్డి
ఎడిటర్ అండ్ పబ్లిషర్.
MOBILE:
9494498787,9440232308.

# విభారె
## తెలుగు దినపత్రిక
## VIBHARE TELUGU DAILY

ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
9440232308,9494498787

PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి బుధవారం 20-12-2023 సంపుటి : 06 సంచిక : 99 పేజీలు : 8 వెల : రూ 3-00

# ఏపీ ప్రజలకు గుడ్ న్యూస్..

## కొత్త ఫీచర్లతో స్మార్ట్ హెల్త్ కార్డ్.. పూర్తి వివరాలు



అమరావతి (ఆంధ్ర రేఖ. ప్రతినిధి): ఇకపై ఆరోగ్యశ్రీ కార్డుదారులకు రూ. 25 లక్షల వరకూ ఉచిత వైద్యాన్ని అందించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా..కొత్త ఫీచర్లతో స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీని ప్రారంభించారు సీఎం జగన్. ఇకపై, రాష్ట్రంలో ఏ పేదవాడు కూడా వైద్యం కోసం అప్పుల పాలు కాకూడదని, ఆరోగ్యశ్రీ సేవలపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు ముఖ్యమంత్రి జగన్.అధికారంలోకి వచ్చిన నాటినుంచి విద్య-వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్. ఎన్నో కార్యక్రమాలతో ప్రజా సంక్షేమానికి పునాదులు వేస్తున్నారు. ఈ క్రమంలోనే నాడు ? నేడుతో ఆస్పత్రుల రూపురేఖలు మార్చే ప్రయత్నం చేస్తున్నారు. అదే సమయంలో కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా ప్రభుత్వ వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చే విధంగా ప్రభుత్వం పనిచేస్తోంది. లేటెస్ట్‌గా ఆరోగ్యశ్రీ పరిధిని రూ.25 లక్షల వరకూ పెంచుతూ సంచలన నిర్ణయం తీసుకున్నారు సీఎం వైఎస్ జగన్.ఎవరికి ఎలాంటి వైద్యం అవసరమైనా? ఆరోగ్యశ్రీ కార్డు ఉంటే.. రూ. 25 లక్షల వరకూ ఉచితంగా చికిత్స లభించనుంది. అంతేకాకుండా ఆరోగ్యశ్రీలో చికిత్స చేయించుకున్న వారికి మళ్లీ డాక్టర్ దగ్గరకు వెళ్లి చెకప్ చేయించుకునేందుకు, రవాణా ఛార్జీల కింద రూ. 300 చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలోనే తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయం నుంచి కొత్త ఫీచర్లతో స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీని సీఎం వైఎస్ జగన్ ప్రారంభించారు. పేదలకు వైద్యం భారం కాకూడదనే ఉద్దేశంతో, ఆరోగ్యశ్రీని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ పథకాన్ని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు ముఖ్యమంత్రి.వైద్యరంగంలో సంస్కరణలకు 55 నెలల కాలంలో రూ.32,279 కోట్లు ఖర్చు చేశామన్నారు సీఎం జగన్. రాష్ట్రంలో ఏ పేదవాడు కూడా వైద్యం కోసం అప్పుల పాలు కాకూడదని అడుగులు వేస్తున్నామని.. ఆరోగ్యశ్రీ సేవలపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పేదవాడికి ఖరీదైన వైద్యం అందిస్తున్నామని చెప్పారు సీఎం జగన్.విద్య, వైద్యం అనేది ప్రజల హక్కు. ఈ హక్కులను కాపాడడం ప్రభుత్వ బాధ్యత. అందుకనే అధికారంలోకి వచ్చిన రోజు నుంచే వీటిపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు సీఎం జగన్ తెలిపారు. ఆసుపత్రి భవనాలను ఆధునీకరించడమే కాకుండా వైద్యులు, సిబ్బంది సమయపాలన విషయంలో కీలక సంస్కరణలు తీసుకొచ్చారు. అన్ని రకాల వైద్యపరీక్షలు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే నిర్వహిస్తున్నారు. ఒక్క వైద్య ఆరోగ్య శాఖలోనే 53,126 మంది డాక్టర్లు, నర్సులు, పారామెడిక్స్ లాంటి వైద్య సిబ్బందిని నియమించి సామాన్యునికి మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం కృషిచేస్తోంది. ఇప్పుడు ఆరోగ్యశ్రీని రూ. 25 లక్షలకు పెంచుతూ చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది వైసీపీ సర్కార్.ప్రతి ఒక్కరూ ఆరోగ్యశ్రీ కింద ఉచిత సేవలు పొందేందుకు వివరంగా తెలియచేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు ముఖ్యమంత్రి. మంగళవారం నుంచి ప్రతి నియోజకవర్గంలోని ఐదు గ్రామాల్లో ఆరోగ్యశ్రీ ప్రచార కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు ఆయా గ్రామాల్లో వీటిని ప్రారంభిస్తారు. ఇలా ప్రతి వారం మండలానికి నాలుగు గ్రామాల చొప్పున కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, సీహెచ్‌వోలు ఒక బృందంగా, మరో బృందంలో ఆశా వర్కర్లు, ప్రజాప్రతినిధులు పాలు పంచుకుంటారు.

# లోక్ సభలో నేడు 49 మంది ఎంపీలపై వేటు



ఢిల్లీ: (ఆంధ్ర రేఖ. ప్రతినిధి)పార్లమెంట్‌లో నేడు మరింత మంది ఎంపీలు సస్పెండ్ అయ్యారు. పార్లమెంట్ భద్రతా వైఫల్యం అంశంపై గందరగోళం సృష్టించిన కారణంగా ఇవాళ ఒక్కరోజే లోక్‌సభ నుంచి 49 మంది ఎంపీలను సస్పెండ్ చేస్తూ స్పీకర్ నిర్ణయం తీసుకున్నారు.ఇదే అంశంపై పార్లమెంట్‌లో నిన్న 78 మంది సస్పెండ్ అయ్యారు. ఈ సెషన్‌లో ఇప్పటివరకు మొత్తంగా 141 మంది ఎంపీలపై వేటు పడింది.సస్పెన్షన్‌కు గురైన ఎంపీల్లో కాంగ్రెస్‌కు చెందిన శశిథరూర్, మనీష్ తివారీ, కార్తీ చిదంబరం, ఎన్‌సీపీకి చెందిన సుప్రియా సూలే, సమాజ్‌వాదీ పార్టీకి చెందిన డింపుల్ యాదవ్, ఎన్‌సీపీకి చెందిన ఫరూక్ అబ్దుల్లా, డీఎంకేకు చెందిన ఎస్ సెంథిల్‌కుమార్, ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన సుశీల్ కుమార్ రింకు, సుదీప్ బంధోపాధ్యాయ ఉన్నారు. ఎంపీల సస్పెన్షన్ తీర్మానాన్ని కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ప్రవేశపెట్టారు.పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో లోక్‌సభలో నిన్న 33 మంది విపక్ష సభ్యులు సస్పెండ్ అయ్యారు. రాజ్యసభలో 45 మంది ఎంపీలను సస్పెండ్ చేశారు. పార్లమెంట్ భద్రతా వైఫల్యం అంశంపై సభలో గందరగోళం సృష్టించడంతో స్పీకర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. సస్పెండ్ అయిన ఎంపీల్లో కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ అధిర్ రంజన్ చౌదరి, డీఎంకే ఎంపీలు టీఆర్ బాలు, దయానిధి మారన్, టీఎంసీ ఎంపీ సౌగతా రాయ్ తదితరులు ఉన్నారు. డిసెంబర్ 13న పార్లమెంట్‌లో భద్రతా వైఫల్యం ఘటన జరిగింది. నలుగురు యువకులు పార్లమెంట్ లోకి చొరబడి గ్యాస్ క్యానిస్టర్లను ప్రయోగించారు. ఇద్దరు యువకులు లోక్‌సభ లోపల గ్యాస్ బాంబులను ప్రయోగించగా.. మరో ఇద్దరు పార్లమెంట్ ఆవరణలో అలజడి సృష్టించారు.ఈ ఘటన జరిగిన మరుసటి రోజు పార్లమెంట్‌లో విపక్ష సభ్యులు ఆందోళన చేశారు. కేంద్ర మంత్రి అమిత్ షా మాట్లాడాలని పట్టుబట్టారు. ఈ క్రమంలో 14 మంది సస్పెన్షన్‌కు గురయ్యారు. ఇందులో కాగా, 13 మంది లోక్ సభ సభ్యులు ఉన్నారు. ఈ రోజు సస్పెండ్ అయిన ఎంపీలతో కలిపి మొత్తంగా 141 మంది విపక్ష సభ్యులు సస్పెండ్ అయ్యారు.

# నారా లోకేశ్ కోసం ఇద్దరు యాంకర్లు రెడీ అయ్యారు: అంబటి సెటైర్లు



అమరావతి: (ఆంధ్ర రేఖ. ప్రతినిధి) లోకేష్ పాదయాత్ర వలన ఎవరికైనా ప్రయోజనం ఉందా? అని మంత్రి అంబటి రాంబాబు ప్రశ్నించారు. ఎవరూ గుర్తించని యాత్ర అది అని ఎద్దేవా చేశారు. కనీసం లోకేష్‌కైనా, పార్టీకైనా ఈ యాత్ర ఉపయోగపడిందా?అని అన్నారు. లోకేష్ కుప్పంలో అడుగు వేయగానే తారకరత్న మృతి చెందారు. లోకేష్‌ది అశుభయాత్ర అంటూ నిప్పులు చెరిగారు. పాదం పెట్టగానే నందమూరి వంశస్తుడు టపీమని చనిపోయారని అన్నారు.'ఎలుకతోలు తెచ్చి ఏడాది ఉతికినా తెల్లగ మారదనే వేమన శతకంలాగ లోకేష్ యాత్ర కొనసాగింది. యాత్ర వలన ఒళ్లు తగ్గిందే తప్ప, మైండు మెచ్యూరిటీ లేదు. కుప్పంలో అడుగు వేయగానే తారకరత్న మృతి చెందారు. అశుభయాత్ర చేశాడు లోకేష్. పాదం పెట్టగానే నందమూరి వంశస్తుడు చనిపోయాడు. జనంలేక వెలవెలబోయిన రోజులు ఎన్నో ఉన్నాయి. ఎల్లోమీడియా నైతే విపరీతంగా జనం వచ్చారని చెప్పటానికి తెగ ప్రయత్నం చేసింది. చివరికి యాంకర్ ఉదయభానుని తెచ్చి మీటింగ్ పెట్టుకోవాల్సి వచ్చింది' అని అంబటి అన్నారు.'బీసీ, ఎస్సీ, ఎస్టీ చౌదర్లులారా.. అంటూ లోకేష్ మాట్లాడారు. మూడు పదిహేను వేలు తొంభై వేలు అని చెప్పిన అజ్ఞాని లోకేష్. బాలకృష్ణ రేపు యాంకరింగ్ చేయబోతున్నారు. ఇంకో యాంకర్ పవన్ కళ్యాణ్ కూడా రేపు యాంకరింగ్ చేయబోతున్నారు. వృద్ధ తండ్రి తన అసమర్ధ కొడుకుని హైలెట్ చేయటానికి చేస్తున్న ప్రయత్నమే కనిపిస్తుంది. లోకేష్ యాత్ర అంత విజయవంతమైతే బాలకృష్ణ, పవన్ కళ్యాణ్‌ల యాంకరింగ్ ఎందుకు? సీట్లు, నోట్లు మాట్లాడుకుని పవన్ కళ్యాణ్‌తో యాంకరింగ్‌కి ఒప్పించుకున్నారు. కిరాయి తీసుకుని పవన్ కళ్యాణ్ లోకేష్ సభకి యాంకరింగ్ చేస్తున్నారు. స్పెషల్ ఫ్లైట్లు, స్పెషల్ రైళ్లలో రేపు జనాన్ని తరలిస్తున్నారు.' అని అంబటి చెప్పారు.'స్కాంలో సంపాదించిన సొమ్ము రేపు ఖర్చు పెట్టబోతున్నారు. సోదరుడికి, చౌదరికి తేడా తెలీని వ్యక్తి లోకేష్. సూట్ కేసులు మోసేది నాదెండ్ల మనోహర్. ప్రజల్లో గెలవకుండా మంత్రి ఐన వ్యక్తి లోకేష్. అలాంటి వారికి ప్రజల కష్టాలేం తెలుసు? 175 సీట్లు గెలవటమే లక్ష్యంగా ఇన్ఛార్జుల ప్రకటన జరుగుతోంది. అంతర్గత బదిలీలు సహజంగా జరుగుతుంటాయి. చంద్రబాబు చంద్రగిరి నుండి కుప్పం ఎందుకు బదిలీ అయ్యారు?' అని అంబటి మండిపడ్డారు.

# ఆడుదాం ఆంధ్ర" టీమ్ ల ఫార్మేషన్ తక్షణమే పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజిర్ జిలాని సమూన్

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 19-ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలకు సంబంధించి అన్ని మండలాలు, మున్సిపాలిటీలో టీమ్ ల ఫార్మేషన్ తక్షణమే పూర్తి చేసి నివేదికలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజిర్ జిలాని సమూన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలపై అన్ని మండలాల ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా పరిషత్ సీఈవో సుబ్బారెడ్డి, జిల్లా కీడాప్రాధికార అధికారి రాజు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజిర్ జిలాని సమూన్ మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర క్రీడా సంబరాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో పోటీల నిర్వహణకు మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నిర్వహించాలని ఆదేశించారు. ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలకు సంబంధించి అన్ని మండలాలు, మున్సిపాలిటీల్లో టీమ్ ల ఫార్మేషన్ తక్షణమే పూర్తి చేసి నివేదికలు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇందుకోసం ఏర్పాటు చేసిన ఆర్గనైజింగ్ కమిటీలు పూర్తిస్థాయి శ్రద్ధ తీసుకుని క్రీడా పోటీల ఏర్పాట్లకు చర్యలు గైకొనాలన్నారు. అన్ని



మండలాలు, మున్సిపాలిటీలు, గ్రామ, వార్డు సచివాలయాలన్నింటికీ ఆడుదాం ఆంధ్ర క్రీడా పరికరాలు సరఫరా చేయడం జరిగిందని... 100 శాతం క్షేత్రస్థాయి ప్రాంతాలకు చేరేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. క్రీడా పోటీలకు సంబంధించిన క్రీడా పరికరాలు ఇంకా రాకపోతే తమ దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. పట్టణ ప్రాంతాల్లో ఆట స్థలాలను గుర్తించి రాళ్లు లేకుండా చదను చేసుకోవాలన్నారు. క్రికెట్, బాడ్మింటన్, వాలీబాల్, కోకో, కబడ్డి వంటి క్రీడా పోటీల నిర్వహణ ప్రదేశాల్లో షామియానా, ఆరోగ్య వైద్య శిబిరాలు త్రాగునీటి వసతి, పారిశుధ్య ఏర్పాట్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ సంబంధించి అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డిపిఓ మంజులవాణి, డిఎల్డిఓ కళ్యాణి, డ్వామా పిడి రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కొత్తగా 142 కరోనా కేసులు..

## కర్ణాటకలో ఒకరు మృతి

న్యూఢిల్లీ : దేశంలో మళ్లీ కరోనా కేసులు కలకలం సృష్టిస్తున్నాయి. కొత్తగా 142 కేసులు నమోదైనట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. దీంతో యాక్టివ్ కేసుల సంఖ్య 1,970కి చేరింది. కర్ణాటకలో ఒకరు మృతి చెందారు. నిన్న కేరళలో ఐదుగురు, యూపీలో ఒకరు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. దీంతో కరోనా మృతుల సంఖ్య ఏడుకు చేరింది. కరోనా కారణంగా ఇప్పటి వరకు 5,33,318 మంది మరణించినట్లు ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. కరోనా నుంచి



4.44 కోట్ల మంది రికవరీ కాగా, రికవరీ రేటు 98.81 శాతంగా ఉంది.ఒక్క కేరళలోనే తాజాగా 115 కేసులు నమోదు అయ్యాయని, మొత్తం యాక్టివ్ కేసుల సంఖ్య 1,749కి చేరిందని ఆరోగ్య శాఖ తెలిపింది. కేరళ పొరుగు రాష్ట్రం కర్ణాటకలో 10 కేసులు నమోదు కాగా, ఒకరు మరణించారు. దేశంలో సోమవారం కొత్తగా 260 కేసులు నమోదు అయినట్లు పేర్కొన్నారు.

# సంపాదకీయం

బుధవారం 20-12-2023

## వివక్ష.. మానవతా కోణమా...

మహిళా ఉద్యోగులకు నెలసరి సెలవులు ఇవ్వాలా వద్దా..? దాదాపు మూడు రోజులుగా దేశవ్యాప్తంగా ఇదే చర్చ. ఇది ఎప్పుడూ జరిగే డిబేట్ అయినప్పటికీ ఇటీవల లోక్‌సభలో ఈ ప్రస్తావన రావడం వల్ల మరోసారి చర్చ జరుగుతోంది. ఓ ఎంపీ అడిగిన ప్రశ్నకు సమాధానం చెబుతూ కేంద్రమంత్రి స్మృతి ఇరానీ కాస్త గట్టిగానే స్పందించారు. నెలసరి అనేది వైకల్యం కాదని, సెలవులు ఇచ్చి వివక్ష చూపించలేమని తేల్చి చెప్పారు. ఈ వ్యాఖ్యల్ని ఎంత మంది సమర్థించారో అంత మంది వ్యతిరేకిస్తున్నారు. అసలు అమలు చేయాలా వద్దా అని ప్రశ్నిస్తే ఒక్కొక్కరూ ఒక్క సమాధానమిస్తున్నారు. అందులో ఎక్కువగా వినిపిస్తున్న సమాధానం "వివక్ష". నిజానికి పీరియడ్స్ అనేది బయాలజికల్ ప్రాసెస్. ప్రతి మహిళలో సాధారణంగా జరిగే ప్రక్రియ. ఈ నార్మాలిటీని వేరుగా చూసి వాళ్లకు సెలవులు ఇవ్వడం వల్ల వివక్ష చూపించినట్టే అవుతుందన్నది ఓ వాదన. పీరియడ్స్ టైమ్‌లో మహిళలు పొత్తికడుపు నొప్పితో బాధ పడతారు. కండరాల నొప్పి కూడా మెలిపెడుతుంది. వాటికి తోడు తలనొప్పి ఇబ్బంది పెడుతుంది. ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని వాళ్లకు సెలవులు ఇవ్వడం అనేది మానవతా కోణంలో సరిగానే అనిపిస్తుండొచ్చు. కానీ నెలసరి సరిగ్గా రాని మహిళల పరిస్థితేంటి..? వాళ్లు సెలవులు తీసుకోకపోతే నెలసరి రావడం లేదని అందరికీ అర్థమైపోదా..? వాళ్లు రహస్యంగా ఉంచాలనుకున్న సమస్యలు బయట పడాలా..? అన్నది మరో వాదన. పిసిఓడితో బాధ పడుతున్న మహిళలకు రెగ్యులర్‌గా పీరియడ్స్ రావు. భారత్‌లో నెలసరి వస్తున్న మహిళల్లో దాదాపు 20% మంది పిసిఓడితో ఇబ్బంది పడుతున్నట్టు కొన్ని నివేదికలు చెబుతున్నాయి. మరి వాళ్ల సంగతేంటి..అని కొందరు మహిళలు ప్రశ్నిస్తున్నారు. ఏ వాదన ఎలా ఉన్నా ఇప్పటికే చాలా కంపెనీలు మహిళా ఉద్యోగులకు పీరియడ్ లీవ్స్ ఇచ్చే ఆలోచన చేశాయి. కొంత మంది అందుకు సంబంధించిన పాలసీలూ సిద్ధం చేశాయి. జొమాటో అందులో ఒకటి. వాస్తవానికి పీరియడ్ లీవ్స్ గురించి 1992 నుంచే చర్చ జరుగుతోంది. అప్పట్లో బిహార్ ప్రభుత్వం కేటగిరీలో వీటిని అమల్లోకి తీసుకొచ్చింది. కానీ...అప్పటికి ఇప్పటికి పరిస్థితులు మారిపోయాయి. అదేదో అంటరాని జబ్బులా కాకుండా నార్మలైజ్ చేయడానికి ప్రయత్నిస్తూనే ఉన్నారు. పీరియడ్స్‌పై ఆలోచనా విధానం కూడా మారిపోతోంది. దాన్నో డిజబిలిటీగా చూడొద్దని వాదిస్తున్నారు. కేరళ ప్రభుత్వం కూడా ఇప్పటికే ఓ కీలక నిర్ణయం తీసుకుంది. యూనివర్సిటీల్లోని యువతులకు నెలసరి సెలవులు ప్రకటించింది. విద్యార్థుల విషయంలో చూసుకుంటే మాత్రం ఈ నిర్ణయాన్ని చాలా మంది సమర్థిస్తున్నారు. అందుకు కారణం లేకపోలేదు. కొన్ని మారుమూల ప్రాంతాల్లో నెలసరి సమయంలో అమ్మాయిలు స్కూల్‌కి, కాలేజ్‌కి వెళ్లడానికి అసౌకర్యంగా ఫీల్ అవుతారు. కొన్ని స్కూల్స్‌లో టాయిలెట్స్ సరిగ్గా ఉండవు. ఇక ప్యాడ్‌లు మార్చుకోవడం అంటే నరకం. కొందరికి ప్యాడ్స్‌పై సరైన అవగాహన కూడా ఉండదు. అందుకే చాలా మంది నెలసరి రోజుల్లో ఇంటి పట్టునే ఉంటున్నారు. ఇక మరీ వెనకబడిన ప్రాంతాల్లో అయితే పూర్తిగా చదువు మానేస్తున్నారు. ఫలితంగా ఏటా డ్రాపౌట్‌లు పెరుగుతున్నాయి. మహిళలకు నెలసరి సెలవులుఇచ్చేందుకు ఏవో కొన్ని సంస్థలు మాత్రమే ముందుకొస్తున్నాయి. అందుకు ప్రధాన కారణం..మహిళలకు నాలుగైదు రోజుల పాటు సెలవులు ఇచ్చేస్తే ప్రొడక్టివిటీ పడిపోతుందని. ఇప్పటికే మెటర్నిటీ లీవ్స్ ఇస్తున్నాం కదా..మళ్లీ ఇవేంటి అని ప్రశ్నిస్తున్నాయి కొన్ని కంపెనీలు. పైగా కొన్ని సంస్థలైతే అసలు మహిళలను హైర్ చేసుకోవడం లేదు. మహిళలను హైర్ చేసుకుంటే కచ్చితంగా పీరియడ్ లీవ్స్ ఇవ్వాల్సి వస్తోంది. నార్త్ అమెరికా, ఐరోపా దేశాల్లో పెయిడ్ పెటర్నిటీ లీవ్స్ ఇస్తున్నారు. వీటితో పాటు పేరెంటల్ లీవ్స్ కూడా ఇస్తున్నారు. అంతే కాదు. గర్భిణిలను హైర్ చేసుకోకుండా వివక్ష చూపించిన వాళ్లపై ఆయా దేశాల ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకుంటున్నాయి. ఇదే స్థాయిలో భారత్‌లోనూ కఠినంగా అమలు చేస్తారా అన్నది మరో చర్చ. మరో ఇంట్రెస్టింగ్ డిస్కషన్ ఏంటంటే...పెయిడ్ పీరియడ్ లీవ్స్‌కి బదులుగా ఉద్యోగులకు ఇవ్వాలని కొందరు ప్రతిపాదిస్తున్నారు. ఇలా చేయడం వల్ల వివక్ష చూపిస్తున్నామన్న ఆలోచనే రాదు. పైగా ప్రొడక్టివిటీ కూడా పెరుగుతుంది. ఇక విదేశాల సంగతి చూస్తే...1947లోనే జపాన్‌లో పిరియడ్ లీవ్ పాలసీ తీసుకొచ్చింది. మహిళలకు 5 రోజుల నెలసరి సెలవులు ఇచ్చిన తొలి ఐరోపా దేశంగా నిలిచింది స్పెయిన్. ఈ రెండు దేశాలతో పాటు చైనా, తైవాన్, ఇండోనేషియా, సౌత్ కొరియా, మెక్సికో జాంబియాలోనూ ఈ పాలసీ అమలవుతోంది. కానీ...భారత్‌లో మాత్రం ప్రభుత్వం అసలు ఆ ఆలోచనే చేయడం లేదని స్మృతి ఇరానీ వ్యాఖ్యలతో స్పష్టత వచ్చేసింది. కేంద్ర ప్రభుత్వం అంత పట్టుదలతో ఉండడానికి ఓ కారణం ఉంది. ఈ పాలసీ తీసుకొస్తే అన్ని రంగాల్లోని మహిళలకూ ఇది వర్తిస్తుంది. మిగతా రంగాల్లో అమలు ఎలా ఉన్నా..అసంఘటిత రంగంలో మాత్రం ఇది అసాధ్యమే. ఫ్యాక్టరీల యాజమాన్యాలు ఈ సెలవులకు భయపడి అసలు మహిళా ఉద్యోగులనే దూరం పెట్టే ప్రమాదముంది. ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో ఫ్యాక్టరీలు నెలసరి ఉన్న మహిళల్ని చేర్చుకోవడం లేదు. ఇదిగో ఈ వివక్ష పెరుగుతుందనేదే ప్రభుత్వం ఆందోళన. అందుకే అంతగా ఆ పాలసీని వ్యతిరేకిస్తోంది.

## ఆర్టీసీ లో పనిచేస్తున్న కాంట్రాక్ట్,ఔట్సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి.. సిఐటియు



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- డిసెంబర్ 19 ఏపీఎస్ ఆర్టీసీ లో పనిచేస్తున్న కాంట్రాక్టు,ఔట్సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని ఏపీఎస్ ఆర్టీసీ కాంటాక్ట్,అవుట్సోర్సింగ్ వర్కర్స్ ఫెడరేషన్ ఏపీ రాష్ట్ర కమిటీ కన్వీనర్ వి.తులసీరామ్,సిఐటియు పట్టణ కార్యదర్శి టి.శివరాం డిమాండ్ చేశారు.ఈ మేరకు మంగళవారం డోన్ ఆర్టీసీ డిపో మేనేజర్ శశిభూషణ్ వారి కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు.అనంతరం వారు మాట్లాడుతూ ఆర్టీసీలో పని చేస్తున్న కాంట్రాక్టు,ఔట్సోర్సింగ్ కార్మికులను ప్రభుత్వం, యాజమాన్యం గాలికి వదిలేసిందని,అద్దె బస్సు డ్రైవర్లకు,ఆర్టీసీ బస్సుల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ డ్రైవర్లకు కనీసం పిఎఫ్, ఈఎస్ఐ వారాంతపు సెలవులు,పబ్లిక్ హాలిడేస్ వర్తింప చేయడం లేదని, గుర్తింపు కార్డులు కూడా ఇవ్వడం లేదని,విధుల్లో మరణించిన కార్మికుల కుటుంబాలకు నష్టపరిహారం అందడం లేదని,నిత్యావసర ధరలు,ఇంటి అద్దెలు,విద్యా, వైద్యం,కరెంటు ఖర్చులు భారీగా పెరుగుతున్నాయని, జీతాలు మాత్రం పెరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే అరకొర వేతనాలు కూడా సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. రెగ్యులర్ కార్మికుల కన్నా అదనంగా పని చేయించుకుంటున్నారని ప్రభుత్వం ఎప్పటికైనా పర్మనెంట్ చేస్తుందని,సమాన పనికి సమాన వేతనం ఇస్తుందని,అద్దె బస్సు డ్రైవర్లు, అవుట్ సోర్సింగ్ డ్రైవర్లకు రిక్రూట్మెంట్లో అవకాశాలు కల్పిస్తారన్న ఆశలతో పని చేస్తున్నారన్నారు.కార్మికులు విధుల్లో చనిపోతున్నా, సర్కులర్ ప్రకారం జీతాలు చెల్లించకపోయినా, ఈఎస్ఐ,పిఎఫ్ అమలు చేయకపోయినా ఆర్టీసీ యాజమాన్యం కాంట్రాక్టర్లను అడగడం లేదని,కార్మికులతో పని చేయించుకునే దానిపై పెడుతున్న శ్రద్ధ కార్మికులకు హక్కులు,చట్టాలు అమలు చేయించే విషయంలో ఆర్టీసీ యాజమాన్యం శ్రద్ధ చూపడం లేదని దీనివల్ల కష్టపడి పనిచేస్తున్న కార్మికులు నష్టపోతున్నారని కనుక నిబంధనల ప్రకారం కార్మికులకు రావలసిన అన్ని ప్రయోజనాలు అందే విధంగా చూడాలని డిఎం కి విన్నవించారు. సానుకూలంగా స్పందించిన ఆయన కార్మికులకు అందవలసిన ప్రయోజనాలు అందే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వెహికల్ మెయింటెనెన్స్ ఇంచార్జ్ పుల్లయ్య పాల్గొన్నారు.

## కోడుమూరు చనుగొండ్ల గూడూరు వరకు త్వరలో రోడ్డు నిర్మాణం





విభారె న్యూస్ డిసెంబర్ 19 కోడుమూరు..బిజెపి కోడుమూరు అసెంబ్లీ కో కన్వీనర్ వేల్పులగోపాల్ మాట్లాడుతూ ఎస్ సి సూపర్నెంట్ ఆఫ్ సివిల్ ఇంజనీర్ జిల్లా పరిషత్ కర్నూలు కమ్యూనికేషన్ కేంద్రమంత్రి దేవాన్ చౌహన్ కోడుమూరు అసెంబ్లీ పర్యటన సందర్భంగా మూడుసార్లు పర్యటించడం జరిగింది సమయంలో చౌహన్ దృష్టికి తీసుకెళ్లాము మరల ఆనంతరం 12.12.23 సందర్భంగా ఇవ్వడం జరిగింది కోడుమూరు చనుగొండ్ల గూడూరు వరకు వెళ్లే రహదారి చాల ఇబ్బందికరంగా ఉన్నది దానిని ప్రజల సౌకర్యార్థం దృష్టి పెట్టుకొని యుద్ధ ప్రాతిపదికన రోడ్డు నిర్మించాలని వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో వినతిపత్రం ఇవ్వడం యుద్ధ ప్రాతిపదికన రోడ్డు మంజూరు చేసినందుకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ కేంద్ర కమ్యూనికేషన్ మంత్రి దేవాన్ష్ చౌహాన్ కేంద్రప్రభుత్వ నిధులు 60 శాతం రాష్ట్ర ప్రభుత్వ నిధులు 40 శాతంతో 6 కోట్ల నిధులతో త్వరలో పూర్తి చేయనన్నందుకు భారతీయ జనతా పార్టీ కోడుమూరు అసెంబ్లీ నాయకులు కార్యకర్తలు ప్రజల తరపున ధన్యవాదాలు తెలుపుతూ నిర్మాణానికి సంబంధించిన వివరాలు ఈకార్యక్రమంలో ఓబిసి మోర్చ రాష్ట్ర ప్రధానకార్యదర్శి మురళినాయుడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉల్చాలలక్ష్మణ్ నాయుడు బెస్తఈరన్న కోడుమూరు మండల ప్రధానకార్యదర్శి మిస్కిన్ శీను రాజేష్ రాంబాబు తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


## కోడుమూరు చనుగొండ్ల గూడూరు వరకు త్వరలో రోడ్డు నిర్మాణం





విభారె న్యూస్ డిసెంబర్ 19 కోడుమూరు..బిజెపి కోడుమూరు అసెంబ్లీ కో కన్వీనర్ వేల్పులగోపాల్ మాట్లాడుతూ ఎస్ సి సూపర్నెంట్ ఆఫ్ సివిల్ ఇంజనీర్ జిల్లా పరిషత్ కర్నూలు కమ్యూనికేషన్ కేంద్రమంత్రి దేవాన్ చౌహన్ కోడుమూరు అసెంబ్లీ పర్యటన సందర్భంగా మూడుసార్లు పర్యటించడం జరిగింది సమయంలో చౌహన్ దృష్టికి తీసుకెళ్లాము మరల ఆనంతరం 12.12.23 సందర్భంగా ఇవ్వడం జరిగింది కోడుమూరు చనుగొండ్ల గూడూరు వరకు వెళ్లే రహదారి చాల ఇబ్బందికరంగా ఉన్నది దానిని ప్రజల సౌకర్యార్థం దృష్టి పెట్టుకొని యుద్ధ ప్రాతిపదికన రోడ్డు నిర్మించాలని వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో వినతిపత్రం ఇవ్వడం యుద్ధ ప్రాతిపదికన రోడ్డు మంజూరు చేసినందుకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ కేంద్ర కమ్యూనికేషన్ మంత్రి దేవాన్ష్ చౌహాన్ కేంద్రప్రభుత్వ నిధులు 60 శాతం రాష్ట్ర ప్రభుత్వ నిధులు 40 శాతంతో 6 కోట్ల నిధులతో త్వరలో పూర్తి చేయనన్నందుకు భారతీయ జనతా పార్టీ కోడుమూరు అసెంబ్లీ నాయకులు కార్యకర్తలు ప్రజల తరపున ధన్యవాదాలు తెలుపుతూ నిర్మాణానికి సంబంధించిన వివరాలు ఈకార్యక్రమంలో ఓబిసి మోర్చ రాష్ట్ర ప్రధానకార్యదర్శి మురళినాయుడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉల్చాలలక్ష్మణ్ నాయుడు బెస్తఈరన్న కోడుమూరు మండల ప్రధానకార్యదర్శి మిస్కిన్ శీను రాజేష్ రాంబాబు తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


## స్కూల్ గేమ్స్ జాతీయ స్థాయి ఈత పోటీలకు జిల్లా క్రీడాకారిణులు

**- 8 గోల్డ్, 2 సిల్వర్, 2 బ్రాన్జ్ మొత్తం 12 పతకాలు కైవసం**

కర్నూలు, విభరె న్యూస్ డిసెంబర్ 19: విజయవాడలో 19, 20 తేదీల్లో నిర్వహించిన 67వ ఏపీ స్టేట్ స్కూల్ గేమ్స్ అండర్ 14, 17 అండ్ 19 గర్ల్స్ స్విమ్మింగ్ ఛాంపియన్షిప్ పోటీల్లో ఉమ్మడి జిల్లా స్విమ్మర్స్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 12 పతకాలు సాధించారు. జనవరి 3 నుంచి 9వ తేదీ వరకు ఢిల్లీలో నిర్వహించే స్కూల్ గేమ్స్ జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలకు అర్హత సాధించారు. అండర్ 19 బాలికల విభాగంలో సెయింట్ జోసెఫ్ కళాశాల ఇంటర్ విద్యార్థిని షేక్ సామియా తస్లీం200 మీటర్స్ బటర్ ఫ్లై,100 మీటర్స్ ఫ్రీ స్టైల్, 50 మీటర్స్ బ్యాక్ స్ట్రోక్ ఫస్ట్ ప్లేస్ గోల్డ్ మెడల్స్, ప్యాపిలి జెడ్ పి హెచ్ స్కూల్ 9వ తరగతి విద్యార్థిని కె. వైశాలి 100 మీటర్స్ బ్రెస్ట్ స్ట్రోక్ సిల్వర్ , 50 ఫ్రీ స్టైల్ బ్రాన్జ్ మెడల్,



శ్రీ చైతన్య కే 2 బ్రాంచ్ 9వ తరగతి విద్యార్థిని ఎం.మౌనిక 100 ఫ్రీ స్టైల్, 100, 50 బ్రెస్ట్ స్ట్రోక్ ఈవెంట్స్ లో ఫస్ట్ ప్లేస్ గోల్డ్ మెడల్స్, ఏ క్యాంప్ మాంటిసోరి పాఠశాల 8వ తరగతి విద్యార్థిని కె.శృతి 400, 200 మీటర్స్ ఫ్రీ స్టైల్ ఫస్ట్ ప్లేస్ 2 గోల్డ్ మెడల్స్, శ్రీ చైతన్య కే9 బ్రాంచ్ 9 వ తరగతి విద్యార్థిని పి.హేమలత 50 బ్రెస్ట్ స్ట్రోక్ సిల్వర్ మెడల్, 200 బ్యాక్ స్ట్రోక్ బ్రాన్జ్ మెడల్స్ సాధించారు. ప్రతిభ కనబరిచిన స్విమ్మర్స్ ను స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి జోషఫ్ లక్ష్మయ్య, డీ ఎస్ ఏ స్విమ్మింగ్ కోచ్ ఏ. నటరాజ్, ప్యాపిలి జెడ్ పి హెచ్ ఎస్ పీడీ, టీ?ం వేునేజర్ జి. విజయులక్ష్మి, సంబధిత విద్యా సంస్థల ప్రధానోపాధ్యాయులు, అధినేతలు విజేతలను అభినందించారు.

## మంగళవారం ను పురస్కరించుకొని శ్రీ సుంకులమ్మ అవ్వ కు ప్రత్యేక పూజలు.



విభారె న్యూస్ డిసెంబర్ 19 ఎమ్మిగనూరు..పట్టణం లోని మెయిన్ బజార్ లో వెలిసిన శ్రీ సుంకులమ్మ అవ్వ దేవాలయంలో అమ్మవారికి మంగళవారం ను పురస్కరించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ప్రాతః కాలంలోనే అమ్మవారికి అభిషేకం అర్చన అలంకరణ చేసి నిమ్మకాయల మాల వేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం అమ్మవారికి మహా మంగళహారతి నిర్వహించారు.అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు విరివిగా పాల్గొన్నారు.అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. పై పూజా కార్యక్రమాలుఅన్నియు ఆలయ పూజారులు నాగరాజు దంపతులు నిర్వహించారు.

## మల్లెల గ్రూప్స్ ఆధ్వర్యంలో అందరి క్రిస్మస్ వేడుకలు

**- 250 మంది వికలాంగులకు, వృద్ధులకు, వితంతువులకు దుస్తులు పంపిణీ చేసిన మల్లెల ఆల్ ఫ్రెడ్ రాజు..**




దుస్తులను పంపిణీ చేస్తున్న మల్లెలఆల్ఫ్రెడ్ రాజు.

విభారె న్యూస్ ఎమ్మిగనూరు డిసెంబర్ 19.మల్లెల గ్రూప్స్ అధినేత డా. మల్లెల ఆల్ ఫ్రెడ్ రాజు ఆధ్వర్యంలో పట్టణంలో క్రిస్టియన్ రిఫార్మ్ చర్చి ఆవరణమునందు అందరి క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మంగళవారం మల్లెల అల్ ఫ్రెడ్ రాజు 250 మందికి పైగా వికలాంగులకు వృద్ధులకు వితంతువులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సి ఆర్ సి చర్చి పాస్టర్ రవితేజ వాక్యోపదేశం చేశారు. నిన్ను వలె నీ పొరుగు వారిని ప్రేమించడమే నిజమైన క్రిస్మస్ అని, క్రీస్తు బోధనలను ప్రతి ఒక్కరు అనుసరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సభలో మల్లెల ఆల్ ఫ్రెడ్ రాజు సతీమణి సిస్టర్ మల్లెల సునీల ఆలపించిన క్రైస్తవ మధుర గీతాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఆదోని పట్టణం ముస్లిం మైనార్టీ సామాజికవేత్త ఉమ్మి సలీం, బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు ఈ.భారతమ్మ, వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షులు బీసీ నాగరాజు, టిడిపి నాయకులు కదిరికోట ఆదెన్న, హ్యూమన్ రైట్స్ రాష్ట్ర అధ్యక్షులు ఇస్మాయిల్ తదితరులు మాట్లాడుతూ మల్లెల ఆల్ ఫ్రైడ్ రాజ్ కుల మతాలకు అతీతంగా చేస్తున్న సామాజిక సేవ అభినందనీయమని పేర్కొన్నారు. గత 18 సంవత్సరాల నుండి పేదలకు క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని దుస్తులు పంపిణీ చేయడం సంతోషకరమన్నారు. మల్లెల ఆల్ ఫ్రెడ్ రాజు తన పుణ్య తల్లిదండ్రులైన దివంగతులు జీవరత్నం, సుశీలమ్మల స్ఫూర్తితో అణగారిన వర్గాలకు అండగా ఉంటున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సి ఆర్ సి సంఘ పెద్దలు దేవప్రసాద్, సాల్మన్, మల్లెల గ్రూప్స్ సభ్యులు మల్లెల సాల్మన్ రాజు, ఉలిద్ర సామేలు, ములుగుందం హనుమంతు, సతీష్, అజిత్, మత్తు తదితరులు పాల్గొన్నారు.

# జనసైనికుల్లో అంతర్మధనం...



విజయవాడ, డిసెంబర్ 19 , జనసేన అధినేత పవన్ కల్యాణ్ వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా కూటమిని విజయం వైపు పయనించేలా చూడాలనుకుంటున్నారు. వైసీపీని ఓడించడమే ప్రధాన ధ్యేయంగా ఆయన పనిచేస్తున్నారు. అందుకోసమే టీడీపీతో పొత్తు పెట్టుకున్నారు. అయితే ఇప్పటికీ పవన్ కల్యాణ్ కు రాజకీయాల పట్ల సీరియస్ నెస్ లేదన్న కామెంట్స్ ఆ పార్టీ నేతల నుంచే వినిపిస్తున్నాయి. ఏపీ ఎన్నికలకు ఇంకా మూడు నెలలు మాత్రమే సమయం ఉంది. ఫిబ్రవరి నెలలో షెడ్యూల్ విడుదలయ్యే అవకాశాలున్నట్లు చెబుతున్నారు. అధికార వైసీపీ కూడా ఇప్పటి నుంచే అభ్యర్థుల ఎంపికపై కసరత్తులు ప్రారంభించింది. నియోజకవర్గాలను మారుస్తూ కొంత మార్పు తెచ్చే ప్రయత్నానికి జగన్ శ్రీకారం చుట్టారు. పదకొండు నియోజకవర్గాల్లో ఇన్‌ఛార్జులను మార్చారు. మంత్రులకు కూడా మినహాయింపు ఇవ్వలేదు. ఒకవైపు అధికార వైసీపీ అంత సీరియస్ గా స్టెప్స్ వేస్తుంటే... పవన్ మాత్రం నింపాదిగా ఉన్నారు. ఇప్పటి వరకూ ఏ నియోజకవర్గాల్లో పోటీ చేస్తామన్న క్లారిటీ ఆయనకు లేదు. అంతేకాకుండా వేళ్ల మీద లెక్కపెట్టినంత అంటే పదిలోపు నియోజకవర్గాల్లోనే జనసేనకు బలమైన అభ్యర్థులున్నారు. ఆర్థికంగా, సామాజికంగా బలమైన వారు పది మంది మాత్రమే ఉంటారన్నది కాదనలేని వాస్తవం. అలాంటి పరిస్థితుల్లో ఇతర పార్టీల నుంచి వచ్చే వారు కూడా లేరు. అధికార వైసీపీ నుంచి వస్తే చేర్చుకునే అవకాశం లేదు. బలహీనంగా ఉన్న కాంగ్రెస్ నుంచి వచ్చిన వారిని చేర్చుకునేందుకు ఎలాంటి ఇబ్బందులు పవన్ కు ఉండవు. కానీ అసలా ప్రయత్నమే చేసినట్లు కనపడటం లేదు. తాను అందరితోనూ అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నట్లు ఉండి..ఎవరినీ నమ్మకపోతే.. ఇలాగే ఉంటది మరి. మరోవైపు వారాహి యాత్రను కూడా మధ్యలోనే నిలిపేశారు. యాత్రను ఆపేసి నెలలు కావస్తుంది. వారాహి యాత్ర తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాలో కొంత భాగంలో మాత్రమే తిరిగింది. జనం భారీగానే వచ్చారు. ఆ వేడిని ఆసాంతం ఎన్నికల వరకూ నిలపాలన్న స్పృహ జనసేనానిలో లేదు. ఇలాగయితే జనం దృష్టిలో పార్ట్ టైం పొలిటీషియన్ గానే పవన్ ముద్ర పడిపోతారు. ఏదో పార్టీ కార్యాలయంలో ఎంపిక చేసిన వారితో సమావేశం ఏర్పాటు చేసుకుని ప్రసంగించి వెళ్లిపోతే కుదరదు. క్షేత్రస్థాయిలో పర్యటనకు వెళ్లాల్సి ఉంటుంది. జనం మనసులను గెలుచుకోవాల్సి ఉంటుంది. తన సభలకు జనాన్ని చేరవేసే అవసరం లేదు. అది పవన్ కు ఒక వరమనే అనుకోవాలి. కానీ దానిని పవన్ కల్యాణ్ సద్వినియోగం చేసుకోలేకపోతున్నారన్న విమర్శలు పార్టీ నుంచే వినిపిస్తున్నాయి. వారాహి యాత్ర ఎందుకు మొదలు పెట్టినట్లు? ఎందుకు ఆపినట్లు? తనకు కొద్దో గొప్పో బలమున్న చోట మాత్రమే తిరిగితే మిత్రపక్షమైన టీడీపీ దృష్టిలో చులకనగా మారరా? సీట్ల పంపకాల విషయంలోనూ టీడీపీదే పైచేయి కాదన్న గ్యారంటీ ఉందా? అప్పుడు అనుకుని ఏం లాభం? తాను కష్టపడి తిరిగి జనంలో ఒక మూడ్ ను క్రియేట్ చేయగలిగితే టీడీపీ దానంతట అదే దిగి వస్తుంది. తన మద్దతును టీడీపీ కోరుకోవాలని కాని, తానే టీడీపీ మద్దతు కోసం పరితపించినట్లు కనిపిస్తే మరింత చులకనగా కారా? అన్న ప్రశ్నకు పవన్ నుంచి సమాధానం ఉండదు. పవన్ కల్యాణ? తన మాట కాదనకుండా చేసుకున్నప్పుడే జనసైనికులు వెంట నడుస్తారు. అభిమానులు అండగా నిలబడతారు. కాకుంటే మళ్లీ మొన్నటి ఎన్నికల ఫలితాలే వస్తాయన్నది విశ్లేషకుల అంచనా.

# మళ్లీ 2014 కూటమి...

గుంటూరు, డిసెంబర్ 19 రాజకీయాల్లో శాశ్వత శతృత్వం ఉండదంటారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో అది మరింతగా తేటతెల్లమైన విషయమే. పాతమిత్రుల కలయికతో మరోసారి ఏపీ రాజకీయాలు రసవత్తరం కాబోతున్నాయన్న ఊహాగానాలు అన్ని పార్టీల్లో కొత్త చర్చలకు తెరలేపాయి. రాష్ట్ర విభజన అనంతరం జరిగిన తొలి ఎన్నికల్లో టీడీపీ, జనసేన రెండూ కమలంతో కలిసి నడవగా.. ఐదేళ్లలో టీడీపీ కాంగ్రెస్ గూటికి చేరి వైరిపక్షంగా మారింది. క్రమంగా జనసేన, టీడీపీ మధ్య అంతరం పెరిగింది. చంద్రబాబు అరెస్టు అనంతరం ఇటీవలే మళ్లీ సైకిలెక్కిన జనసేనాని బీజేపీతో తమ ప్రయాణంపై ఎటూ చెప్పలేదు. మొత్తానికి రెండోసారి కేంద్రంలో ఎన్డీఏ సర్కారు ఏర్పాటైన తర్వాత వేర్వేరు మార్గాల్లో నడుస్తూ మధ్యలో కలిసిన ఈ ఇద్దరు మిత్రులూ గతంలో తమ ఉమ్మడి స్నేహపక్షమైన కమల శిబిరంలో తిరిగి చేరాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది. దీంతో 2024 సార్వత్రిక ఎన్నికలనే కూడలిలో ముగ్గురు పాత మిత్రులూ కలిసి కూటమిగా ప్రత్యర్థులతో తలపడబోతున్నారన్న వార్తలు ఇంటా బయటా షికారు చేస్తున్నాయి. బీజేపీ రాష్ట్ర, జాతీయ అధిష్టానాల ధోరణి కూడా ఆ ప్రచారానికి ఆజ్యం పోస్తోంది.ఏపీలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా తమ పట్టు నిలుపుకునే ఆలోచనలో బీజేపీ అధిష్టానం ఉన్నట్లు తాజా పరిణామాలను బట్టి తెలుస్తోంది. దక్షిణాదిలో ఒక్క రాష్ట్రంలోనూ ప్రస్తుతం అధికారంలో లేని కమలం పార్టీ ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను పరోక్షంగా శాసించాలని భావిస్తున్నట్టు దాదాపు స్పష్టమవుతున్నది. ఈ మేరకు పొత్తులపై బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి రహస్య సంకేతాలు అందినట్లు విశ్వసనీయంగా తెలుస్తున్నది. బీజేపీ అధినాయకత్వం ఆశిస్సులున్నవారే ఏపీలో అధికారంలోకి వస్తారని కూడా గత అనుభవాల దృష్ట్యా కొందరు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో మోడీ, షా, నడ్డా త్రయం ఆంధ్రప్రదేశ్?లో టీడీపీ, జనసేనలతో పొత్తు దిశగా పావులు కదుపుతున్నట్లు సమాచారం. పార్టీ కేడర్?ను ఈ దిశగా సమాయత్తం చేయాలని రాష్ట్ర నాయకులకు కేంద్ర పెద్దలు సూచించారట. కార్యకర్తలను ఇందుకోసం సిద్ధం చేయాలని అమిత్ షా సూచించారని తెలుస్తోంది. అయితే, పొత్తును అధికారికంగా వెల్లడించడానికి మరికొంత సమయం పట్టే అవకాశముందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయిగతంలో ఏపీలో టీడీపీతో పొత్తుతో బీజేపీ రెండు మంత్రి పదవులు చేపట్టిన విషయం తెలిసిందే. పొత్తులో భాగంగా ఈసారి జనసేనకు 35 సీట్లు, బీజేపీ 15 సీట్లు డిమాండ్ చేస్తున్నాయని; అయితే జనసేనకు 20, ఇచ్చేందుకు తెలుగుదేశం పార్టీ సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది.ఈ పరిణామాల నేపథ్యంలో పొత్తు వార్తలు ఎంతవరకూ నిజమవుతాయో.. ఒకవేళ నిజమైతే, ఏపీలో ఆయా పార్టీల కార్యకర్తలను ఏ మేరకు సంతృప్తి పరుస్తాయో, రాష్ట్ర రాజకీయాలను ఏ మేరకు శాసిస్తాయో వేచిచూడాల్సిందే.


# ఇంటర్ నెట్ చూసి ఇంట్లోనే డ్రగ్స్

నెల్లూరు, డిసెంబర్ 19, నెల్లూరు జిల్లాలో డ్రగ్స్ ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. గతంలో కూడా డ్రగ్స్ సరఫరా చేస్తున్నవారిని చాలాసార్లు పోలీసులు అరెస్ట్ చేశారు కానీ, ఈసారి ఈ కేసులోనే పెద్ద ట్విస్ట్ ఉంది. వీళ్లు లోకల్ గానే డ్రగ్స్ తయారు చేస్తున్నారు. ఇంటర్నెట్ చూసి డ్రగ్స్ తయారీ నేర్చుకున్నామని పోలీస్ ఇన్వెస్టిగేషన్లో ఆ కేటుగాళ్లు అసలు నిజం చెప్పడంతో ఖాకీలు షాకయ్యారు. నెల్లూరులో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని కుటీర పరిశ్రమలాగా డ్రగ్స్ తయారీ మొదలుపెట్టారు. చివరకు పోలీసులకు చిక్కారు. మత్తువదలరా అనే తెలుగు సినిమాలో ఓ అపార్ట్ మెంట్ లో డ్రగ్స్ తయారు చేస్తుంటారు. సరిగ్గా ఈ సినిమాలోని సీన్ నెల్లూరులో జరిగింది. నెల్లూరు రూరల్ మండలంలోని ధనలక్ష్మీపురం సామంతులవారితోపు, ఏవీరెడ్డి కాలనీలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని మత్తు పదార్థాలు తయారు చేస్తున్నారు. ఈ డ్రగ్స్ తయారీపై పోలీసులకు సమాచారం రావడంతో వారు సడన్ గా రైడ్ చేశారు. అక్కడున్న డంప్ చూసి షాకయ్యారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా గూడూరుకు చెందిన పి.సాత్విక్ అనే యువకుడు బీటెక్ చదివి పలు ఉద్యోగాలు చేశాడు. ఈజీ మనీకి అలవాటు పడి ఉద్యోగం వదిలేసి మోసాలకు అలవాటు పడ్డాడు. గూడూరు రాజీపేటకు చెందిన శ్రీనివాసులు, మొగళ్లపాలేనికి చెందిన ఎం.బాబు, గూడూరు రైల్వేస్టేషన్ లో బిర్యానీ, టీ అమ్ముకునే కె.వెంకయ్య, వినోద్ తో ఓ ముఠాని ఏర్పాటు చేశాడు. నెల్లూరు బాలాజీనగర్ కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి పి.వేణుగోపాల్ రెడ్డి అలియాస్ వేణురెడ్డి సూచన మేరకు డ్రగ్స్ తయారీ మొదలు పెట్టాడు సాత్విక్. నిషేధిత మత్తు పదార్థాలైన మెఫేడ్రోన్ లకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని, వాటిని తయారుచేసి తనకు ఇస్తే కమిషన్ ఇస్తానని సాత్విక్ కు వేణురెడ్డి చెప్పాడు. దీంతో ఈ మత్తుమందు తయారీ మొదలు పెట్టాడు సాత్విక్. డ్రగ్స్ ఎలా తయారు చేయాలనే విషయాన్ని సాత్విక్ ఇంటర్నెట్ లో వెదికి తెలుసుకున్నాడు. మత్తుమందు తయారీకి ఏయే పదార్థాలు కావాలో లిస్ట్ రాసుకున్నాడు. ఇంటర్నెట్ లోనే ఆర్డర్ ఇచ్చి రూ. 2.60 లక్షలతో అవసరమైన మిషనరీని కొనుగోలు చేశాడు. అవసరమైన రసాయనాలను తిరుపతిలోని ఓ బయో సైంటిఫిక్ దుకాణంలో కొన్నాడు. తయారీ మొదలు పెట్టాడు. అయితే చుట్టుపక్కలవారికి వీరి వ్యవహారంపై అనుమానం వచ్చింది. వారి ద్వారా విషయం పోలీసులకు చేరింది. పోలీసులు ఆ ఇంటిపై నిఘా పెట్టారు. చివరకు అక్కడ ఏదో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని నిర్థారించారు. సడన్ గా రైడ్ చేయడంతో అసలు బండారం బట్టబయలైంది. నెల్లూరు జిల్లా అడిషనల్ ఎస్పీ డి.హిమవతి ఆధ్వర్యంలో నెల్లూరు రూరల్ ఇన్ స్పెక్టర్ పి.శ్రీనివాసులురెడ్డి, స్పెషల్ బ్రాంచ్ పోలీసులు, డ్రగ్స్ కంట్రోల్, రెవెన్యూ అధికారులు ఆ ఇంటిపై దాడి చేశారు. నిందితులను అరెస్టు చేసి వారి నుంచి సుమారు రూ.15లక్షల విలువైన 560 గ్రాముల నిషేధిత మత్తు పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ తయారీకి ఉపయోగించే 48 రకాల వస్తువులు, సెల్ ఫోన్లు, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు వేణుగోపాల్ రెడ్డి మాత్రం పోలీసులకు దొరకలేదు. డ్రగ్స్ తయారీ కేంద్రంపై దాడి చేసి మిగిలిన వారిని పోలీసులు అరెస్ట్ చేశారు. గతంలో కేవలం డ్రగ్స్ రవాణా, వినియోగంపైనే కేసులు నమోదయ్యాయి. ఈసారి ఏకంగా డ్రగ్స్ తయారీ కేంద్రమే నెల్లూరులో బయటపడటంతో పోలీసులు షాకయ్యారు. ఇలాంటి కార్యకలాపాలు ఇంకెక్కడైనా జరుగుతున్నాయేమోనని ఆరా తీస్తున్నారు.

# బంగారు గనులు....కేరాఫ్ కర్నూలు

కర్నూలు, డిసెంబర్ 19 ( రాయలసీమ రతనాల సీమ.. ఇది ఒకప్పటి నానుడి.. కానీ ఇప్పుడు అది రుజువవుతోంది. ఇప్పటికే కర్నూలు జిల్లా తుగ్గలి మండలంలోని వజ్రకరూరు, జొన్నగిరిలో వజ్రాలు, విలువైన రంగురాళ్లు దొరుకుతున్నాయి. తాజాగా కర్నూలు జిల్లా ఆస్పరి మండలంలోనూ బంగారం గనులు ఉన్నట్లు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా బృందం తేల్చి చెప్పింది. రాయలసీమ రాళ్లలో బంగారం వజ్రాలు దాగి ఉన్నట్లు నిర్ధారణ అయింది. ఫ్యాక్షన్‌తో, వర్గ కక్షలతో నలిగిపోయిన, ఆస్తి ప్రాణ నష్టం కోల్పోయిన కప్పట్రాళ్ల లాంటి ప్రాంతంలో యురేనియం నిల్వలు ఉన్నట్లు సాక్షాత్తు పార్లమెంటులోనే కేంద్రం మంత్రి ప్రకటించడం చూస్తే నిజంగా కర్నూలు జిల్లాకు మంచి రోజులు వచ్చాయా అనిపిస్తుంది.కర్నూలు జిల్లాలోనే అత్యంత వెనుకబడిన కరువు ప్రాంతమైన ఆలూరు నియోజకవర్గం ఆస్పరి మండలంలో బంగారం నిక్షేపాలు ఉన్నట్లు జియో లాజికల్ సర్వే ఆఫ్ ఇండియా నిర్ధారించింది. నాలుగు రోజుల క్రితం విజయవాడలో జరిగిన ఊవి రాష్ట్ర బోర్డు సమావేశంలో ఈ విషయాన్ని ప్రకటించింది. ఎంత పరిమాణంలో ఉన్నాయి, నాణ్యత ఎంత, ఎంత విస్తీర్ణంలో నిక్షేపాలు ఉన్నాయి.. అనే అంశంపై చర్చ జరిగింది. త్వరలో మరోసారి జీఎస్ ఐబృందాలు పరిశీలించాలని కూడా నిర్ణయించింది. ఆస్పరి మండలంలోని చిరుమాను దొడ్డి, అట్టే కళ్ళు, కల్లపరి, యాటకల్లు సహా పరిసర గ్రామాల్లోని భూములలో బంగారు నిక్షేపాలు ఉన్నట్లు జిఎస్ఐ నిర్ధారించింది.వాస్తవంగా ఆస్పరి మండలం అనేది పూర్తిగా వెనుకబడిన కరువు ప్రాంతం. వర్షాలు వచ్చినా కూడా పంటలు అంతంత మాత్రమే పండే భూములే ఇక్కడ. అలాంటి ప్రాంతంలో బంగారు నిక్షేపాలు ఉన్నాయని తెలుసుకున్న స్థానికులు ఒక్కసారిగా భవిష్యత్తుపై ఆశలు పెంచుకున్నారు. తమ పిల్లల భవిష్యత్తు బంగారం అవుతుందని ఆశిస్తున్నారు.సర్వే జరిపిన ప్రాంతం నుంచి ఆ ప్రాంత రైతులు ఏమనుకుంటున్నారు, ఏం ఆశిస్తున్నారు అనే అంశాలపై ఆసక్తికర చర్చ కొనసాగుతోంది.ఇక్కడే కాకుండా ఈ గ్రామానికి మరో 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న చిరుమాను దొడ్డి గ్రామ పొలాలలో కూడా బంగారు నిక్షేపాలు ఉన్నట్లు జిఎస్ఐ తెలిపింది. ఆ ప్రాంత వాసులలో కూడా ఆశలు చిగురించాయి. భవిష్యత్తుపై ఎలాంటి ఆశలు లేని తమకు బంగారు నిక్షేపాలు ఉన్నట్లు తెలియగానే ఆశలు చిగురించాయని.. పిల్లల భవిష్యత్తుపై భరోసా పెరిగిందని రైతులు పేర్కొంటున్నారు.ఆస్పరి మండలంలో బంగారు నిక్షేపాలు ఉన్నట్లు జీఎస్ఐ ఇచ్చిన సమాచారం సంతోషకరమైనప్పటికీ.. బంగారు వజ్రాలు కర్నూలు జిల్లాలో చాలా ఏళ్ల నుంచి ఉన్నట్లు నిర్ధారణ అయింది. తుగ్గలి మండలం జొన్నగిరి ప్రాంతంలో వర్షం వచ్చింది అంటే చాలు ఎవరికో ఒకరికి కచ్చితంగా ఇప్పటికీ వజ్రాలు దొరుకుతూనే ఉన్నాయి. కూలీలు రైతులు స్థానికులు రాత్రికి రాత్రే లక్షాధికారులు అవుతున్నారు. ఇదే మండలంలోని పెరవలి గ్రామంలో, పరిసర ప్రాంతాలలో వజ్రాల వ్యాపారులు ఉన్నారు అంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇదే తుగ్గలి మండలంలోని పగిడిరాయి ప్రాంతంలో బంగారు నిక్షేపాలు సమృద్ధిగా ఉన్నాయి.జియో మైసూర్ కంపెనీ ఈ బంగారు ఖనిజాలను తవ్వకాల ద్వారా వెలికి తీసే కార్యక్రమాన్ని చేపట్టింది. ఇప్పటికే వందలాది ఎకరాలను కొనుగోలు చేసింది. ఇప్పటికే చిన్నచిన్న మిషిన్లను ఏర్పాటు చేసి భూగర్భంలో నుంచి బంగారాన్ని వెలికి తీసే కార్యక్రమం చేపట్టింది. భారీ యంత్రాలను సమకూర్చి బంగారు గనుల తవ్వకాల కోసం జియో మైసూర్ కంపెనీ పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసింది. 70 శాతం భూములను కూడా కొనుగోలు చేసింది. 30% భూముల కొనుగోలు విషయంలో చిన్న చిన్న అభ్యంతరాలు తొలగిపోతే పూర్తిస్థాయిలో బంగారు గనుల తవ్వకాలు చేస్తామని జియో మైసూర్ కంపెనీ ప్రకటించింది. కేంద్రమంత్రి పార్లమెంటులోనే బంగారం లాంటి ప్రకటన చేశారు. కర్నూలు జిల్లాలోని కప్పట్రాళ్ల గ్రామ పరిసరాలలో యురేనియం నిలువలు ఉన్నట్లు నిర్ధారణ అయిందని కేంద్ర మంత్రి ప్రకటించడంతో ఈ ప్రాంతంలో కూడా హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. పూర్తి ఫ్యాక్షన్ ప్రభావిత ప్రాంతమైన కప్పట్రాళ్ల లాంటి ప్రాంతంలో యురేనియం నిల్వలు ఉండి, వాటిని ఉపయోగించుకోగలిగితే ఈ ప్రాంతమంతా అభివృద్ధి పథంలో నడిచే అవకాశం ఉంది.

# వరుస షాక్ లు ఇస్తున్న వైసీపీ




కాకినాడ, డిసెంబర్ 19, ఏపీలో అసెంబ్లీ ఎన్నికల వేడి మొదలైంది. ఓవైపు ప్రతిపక్ష టీడీపీ ప్రచారంలో దూసుకెళ్తుంటే వైసీపీ చాపకింద నీరులా అభ్యర్థుల్ని ఫైనల్ చేస్తూ ప్రత్యర్థులకు షాకిచ్చే ప్రయత్నం చేస్తోంది. ఇటీవల 11 నియోజకవర్గాలకు కొత్త ఇన్ చార్జ్ లను ప్రకటించిన వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సోమవారం మరో నాలుగు నియోజకవర్గాలకు ఇంచార్జ్ లను ఫైనల్ చేశారు. జగ్గంపేట నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబుకి షాకిచ్చారు సీఎం జగన్. ఆ నియోజకవర్గానికి తోట నర్సింహాన్ని ఇన్ చార్జ్ గా ఖరారు చేశారు. తోట నర్సింహం గతంలో టీడీపీ ఆధ్వర్యంలో ఎంపీగా పనిచేశారు. గత ఎన్నికల ముందు ఆయన టీడీపీకి గుడ్ బై చెప్పి వైసీపీలో చేరారు. ఈ దఫా ఆయనకు న్యాయం చేయాలనుకున్నారు సీఎం జగన్. సిట్టింగ్ ఎమ్మెల్యే చంటిబాబుని కాదని తోట నర్సింహంకు ఆ స్థానం కట్టబెడుతున్నారు. కాకినాడ సిట్టింగ్ ఎంపీ వంగా గీత ఈసారి అసెంబ్లీకి పోటీ చేయాలనుకుంటున్నారు. ఆమె కోరికను మన్నించి పిఠాపురం అసెంబ్లీ సీటు కేటాయించాలని సీఎం జగన్ భావిస్తున్నారు. ముందస్తుగా ఆమెను పిఠాపురంకు ఇన్ చార్జ్ గా ఫైనల్ చేశారు. ప్రస్తుతం పిఠాపురంలో పెండెం దొరబాబు వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆయన్ను కాదని ఈసారి అక్కడ వంగా గీతకు అవకాశమిస్తున్నారు సీఎం జగన్. ఇటీవల రామచంద్రాపురం నియోజకవర్గంలో సీఎం జగన్ కి కొత్త తలనొప్పులు వచ్చాయి. వీటికి కూడా ఆయన పరిష్కారం వెదికారు. ఇక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్న చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ నియోజకవర్గాన్ని మార్చేస్తున్నారు. ఈసారి ఆయన్ను రాజమండ్రి రూరల్ నుంచి పోటీకి దింపాలనుకుంటున్నారు. ఆయనకు రాజమండ్రి రూరల్ ఇన్ చార్జ్ గా కొత్త బాధ్యతలు అప్పగించనున్నారు జగన్. ప్రస్తుతం రాజమండ్రి రూరల్ నుంచి టీడీపీ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఉన్నారు. ఈ దఫా ఆ సీటు జనసేనకు ఇచ్చే అవకాశముందనే వార్తలొస్తున్నాయి. అక్కడ టీడీపీ-జనసేనకు ధీటైన ప్రత్యర్థిగా మంత్రి చెల్లుబోయినను ఎంపిక చేశారు సీఎం జగన్. రామచంద్రాపురం నుంచి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణను మరోచోటుకు మార్చాలన్న నిర్ణయంతో రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ తనయుడు సూర్యప్రకాష్ కి అవకాశం ఖాయమైంది. గతంలో ఇదే నియోజకవర్గం విషయమై పిల్లి సుభాష్ చంద్రబోస్, సీఎం జగన్ పై అలిగారు. కొన్నాళ్లు ఆయన ఆ నియోజకవర్గం కోసం పట్టుబట్టారు. వాస్తవానికి పిల్లి సుభాష్ ది రామచంద్రాపురం నియోజకవర్గమే. అయితే 2014లో వైసీపీ తరపున పోటీ చేసి ఆయన ఓడిపోవడంతో 2019లో మండపేటకు మార్చారు జగన్. రామచంద్రాపురంలో చెల్లుబోయినను నిలబెట్టి గెలిపించుకున్నారు. అనూహ్యంగా మండపేటలో కూడా పిల్లి ఓడిపోయారు. వైసీపీ అధికారంలోకి రావడంతో పిల్లిని ముందు మంత్రి వర్గంలోకి తీసుకున్నా.. తర్వాత ఆయన్ను రాజ్యసభకు పంపించారు జగన్. కానీ రామచంద్రాపురంపై ఆయనకు మమకారం అలానే ఉంది. అక్కడ తన తనయుడు సూర్యప్రకాష్ కి టికెట్ ఇప్పించుకోడానికి పట్టుబట్టారు ఎంపీ సుభాష్ చంద్రబోస్. ఇప్పుడు మంత్రి చెల్లుబోయినను రాజమండ్రి రూరల్ కు పంపించేయడంతో రామచంద్రాపురం ఖాళీ అయింది. అక్కడ ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్ కొడుకు సూర్యప్రకాష్ ని ఇన్ చార్జ్ గా నియమించారు సీఎం జగన్.మొత్తమ్మీద సీఎం జగన్ వచ్చే సార్వత్రిక ఎన్నికల కోసం విపరీతమైన ప్రయోగాలు చేస్తున్నారు. ఎంపీలను ఎమ్మెల్యేలుగా బరిలో దింపుతున్నారు. మరి ఎమ్మెల్యేలకు ఎంపీ అవకాశాలు ఇస్తారో లేదో చూడాలి. ఇటీవల 11 నియోజకవర్గాలకు ఇన్ చార్జ్ లను ప్రకటించిన సీఎం జగన్, కొత్తగా నలుగురిని ఇన్ చార్జ్ లుగా ఫైనల్ చేశారు. ఏ క్షణంలోనైనా ప్రకటించే ఛాన్స్ ఉంది. ఈ ప్రకటనతో సిట్టింగ్ లు హర్ట్ అయినా కూడా ఆయన మాత్రం వెనక్కి తగ్గేది లేదంటున్నారు.

# అనంతలో మారుతున్న సమీకరణాలు...

అనంతపురం, డిసెంబర్ 19,సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న కుటుంబం.. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డికి అత్యంత సన్నిహితులు బిఎన్ఆర్ అన్నదమ్ములు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో తిరుగులేని కుటుంబం. ఎప్పుడు ఏ ఎన్నికలు వచ్చినా విజయం వారిదే అన్నట్టుగా అనంతపురంలో సాగేది. అది గతం.. ప్రస్తుతం టికెట్ కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి వచ్చింది. అసలు ఎందుకు బిఎన్నార్ అన్నదమ్ములకు ఈ పరిస్థితి వచ్చింది. అనంతపురం ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ నుంచి బి నారాయణ రెడ్డి 3సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1989, 1999, 2004 ఎన్నికల్లో వరుసగా విజయం సాధించారు. నారాయణరెడ్డి ఆరోగ్య పరిస్థితుల వల్ల 2009లో నారాయణరెడ్డి సోదరుడు గుర్నాథ్ రెడ్డికి కాగ్రెస్ పార్టీలో చోటు కల్పించారు. గుర్నాథ్ రెడ్డి అనుకున్నట్లుగానే 2009లో అనంతపురం అర్బన్ నుంచి పోటీ చేసి గెలుపొందారు. అనంతరం వైఎస్ రాజశేఖర్ రెడ్డి మృతి చెందిన తర్వాత రాష్ట్రంలో అనుకొని రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. జగన్ పార్టీ పెట్టిన అనంతరం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే పదవికి గురునాథ్ రెడ్డి రాజీనామా చేసి వైఎస్సార్ కాంగ్రెస్ తరపున ఉపఎన్నికల్లో పోటీ చేశారు. అత్యధిక మెజార్టీతో గెలుపొందారు. అనంతరం 2014 ఎన్నికల్లో గురునాథ్ రెడ్డి ఓటమి చవిచుశారు. అనంతపురం జిల్లాలో మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డికి అత్యంత సన్నిహితంగా బిఎన్ఆర్ కుటుంబం ఉండేది. రాజశేఖర్ రెడ్డి మరణం అనంతరం జగన్ మోహన్ రెడ్డితో కలిసి నడిచారు. రాజకీయాలు ఎప్పుడు ఎలా ఉంటాయో ఎటువంటి టర్న్ తీసుకుంటాయో తెలియని పరిస్థితి. జగన్మోహన్ రెడ్డికి అత్యంత సన్నిహితంగా ఉంటూ గురునాథ్ రెడ్డి టిడిపి కండువా కప్పుకున్నారు. అక్కడ కొనసాగలేక మళ్లీ సొంతగూటికి వచ్చేశారు. ప్రస్తుతం ఎన్నికల సమీపిస్తుండడంతో ఈసారి ఎలాగైనా అనంతపురం వైసీపీ నుంచి బరిలోకి దిగేందుకు గుర్నాథ్ రెడ్డి పావులు కదుపుతున్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో బిఎన్ఆర్ కుటుంబానికి పటిష్టమైన క్యాడర్ ఉంది. గురునాథ్ రెడ్డి సోదరుడు ఎర్రిస్వామిరెడ్డి అనంతపురం రాజకీయాల్లో తెర వెనక కీలక భూమిక పోషిస్తుంటారని నాయకులు చర్చించుకుంటున్నారు. ప్రస్తుత ఎన్నికల్లో వైఎస్ఆర్సిపి నుంచి టికెట్ దక్కించుకోవాలని బిఎన్నార్ సోదరులు జోరుగానే ఎత్తుగడలు వేస్తూ వస్తున్నారు.

## మంగళవారం దత్త జయంతి సందర్భంగా దత్తాత్రేయ స్వామికి ప్రత్యేక పూజలు.



విభారె న్యూస్ డిసెంబర్ 19 కర్నూలు (జిల్లా ప్రతినిధి). 26-12-2023వ తేదీన శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయం నందు మంగళ వారం దత్త జయంతి సందర్భంగా శ్రీ దత్తాత్రేయ స్వామి వారికి విశేషమైన పూజలు నిర్వహించబడును అందులో భాగంగా శ్రీ దత్తాత్రేయ స్వామి వారికి తైలాభిషేకాలు నిర్వహించబడును భక్తాదులు ఈ వేడుకలో పాల్గొని స్వామివారి సంపూర్ణ అనుగ్రహం పొందగలరని కోరుకుంటున్నాం. తైలాభిషేకం రుసుము: 200/-మహాగణపతి సహితనవగ్రహదత్త హోమము: 3500వంశీ కృష్ణ శర్మ: 9440533770 దేవాలయం ఫోన్ పే గూగుల్ పే నెంబరు:8896123777.

## క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభ పనులను పరిశీలించిన ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి



విభారె న్యూస్ డిసెంబర్ 19 ఎమ్మిగనూరు.ఎమ్మిగనూరు పట్టణం ఇలవేల్పు శ్రీ నీలకంఠేశ్వర స్వామి జాతర సంధర్భంగా ఏర్పాటు చేయనున్న వై.యస్.ఆర్ ఆంతర్ రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్ (23-12-2023) తేదీన ప్రారంభం సందర్భంగా ఈ టోర్నీ కి సీసీ పిచ్ (ఆర్సి మ్యాట్)ను పనులను నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి పరిశీలించారు.ఈ కార్యక్రమంలో నాయకులు, మున్సిపల్ వైస్ చైర్మన్, పట్టణ అధ్యక్షులు,వైస్ ఎంపీపీ, జిల్లా కార్యదర్శి, టౌన్ బ్యాంక్ చైర్మన్, సర్పంచ్, కౌన్సిలర్లు, ఇన్ ఛార్జులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను చూడండి:శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ఎమ్మెల్యే



--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ :19-నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని 32వ వార్డు బొమ్మల సత్రంలో 193వ రోజు మంగళవారం గడపగడపకు మా ప్రభుత్వ కార్యక్రమంలో నంద్యాల శాసనసభ్యులు పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యేకు వార్డు వైసిపి నాయకులు స్వాగతం పలికారు గడప గడప తిరుగుతూ లబ్ధిదారులతో ఆప్యాయంగా పలకరిస్తూ సంక్షేమ పథకాలు వివరించారు. ప్రజలు కూడా వారికి ఉన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు వాటిని అక్కడికక్కడే పరిష్కరించడం తో ప్రజలు ఎమ్మెల్యే శిల్పారవి రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా నంద్యాల శాసనసభ్యులు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో దాదాపు అన్ని సమస్యలను పరిష్కరిస్తున్నామని అదేవిధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పేద ప్రజల కుటుంబంలో సంతోషాన్ని నింపుతున్నాయని ఏక్కడికి వెళ్లిన ప్రజలు జగనన్నను నిండు మనసుతో ఆశీర్వదిస్తున్నా రనిఎన్నడు లేని విధంగా నంద్యాల నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందని ముఖ్యంగా మెడికల్ కళాశాల అలాగే జిల్లా ప్రభుత్వ హాస్పిటల్ వైయస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లు నాడు నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాస్× వైయస్ ఆర్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మైనారిటీల హక్కుల పరిరక్షణకు కృషి

### ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా






విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 19-రాష్ట్రంలోని మైనారిటీల హక్కుల పరిరక్ష ణకు ప్రభుత్వం అహర్నిశలూ కృషి చేస్తోందని ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా అన్నారు. ఆల్ ఇండియా మిల్లి కౌన్సిల్ ఆధ్వర్యంలో ముస్లిం మైనారిటీ హక్కుల పరిరక్షణ దినోత్సవం సందర్భంగా మైనారిటీ హక్కుల పరిరక్షణ, బాధ్యతలపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న డిప్యుటీ సీఎం అంజాద్ బాషా మాట్లాడుతూ మైనారిటీల హక్కులను ప్రజలకు తెలపాలని, వాటిని పరిరక్షించుకునేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలనే ఆలోచనలో భాగంగా ఆలిండియా మిల్లి కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. అన్ని మైనారిటీ వర్గాలను కలుపుకొని రాబోయే రోజుల్లో హక్కుల పరిరక్షణ కోసం పనిచేయాలని సూచించారు. మైనారిటిల పరిరక్షణలో సీఎం జగన్ ముందుంటారని, ఆ విషయంలో ఎవరూ అపోహ పడరాదని, ఎన్ఆర్సి, యుసిసి లాంటి వాటిని రాష్ట్రంలో అమలు చేయబోమని హామీ ఇచ్చినట్లు డిప్యుటీ సిఎం అంజాద్ బాషా వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలిం డియా మిల్లీ కౌన్సిల్ జాతీయ ఉప కార్యదర్శి షా ఖాద్రి ముస్తఫా రిఫాయి జిలాని, రాష్ట్ర కార్యదర్శి మునీర్ అహ్మద్, అధ్యక్షుడు అబ్దుల్ ఖదీర్, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్సులు, నంద్యాల జిల్లా కార్యదర్శి జి.ఎం. గౌస్, మిడియా రాష్ట్ర కార్యదర్శి ఎస్. ఉస్మాన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులను అంగన్ వాడి సెంటర్స్ కు పంపించడం సరైనది కాదు...యూటీఎఫ్



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- డిసెంబర్ 19 డోన్ మండలం నందు అనేక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే పని చేయుచున్నారు అందులో ఒకరిని అంగన్ వాడి సెంటర్ కు పంపించడం వలన విద్యార్థులపై తీవ్ర ప్రభావము పడుచున్నది. మరియు వారి సామర్థ్యాలలో వెనుకబడుచున్నారు. అలాగే ఒక ఉపాధ్యాయుడు అనారోగ్య రీత్యా సెలవు పెట్టుకోవడం కూడా ఇబ్బందిగా ఉన్నది. కావున అంగన్ వాడి సెంటర్ కు ఉపాధ్యాయులను పంపడం సరికాదని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ డోన్ మండల శాఖ తరపున ఎంఈఓ ప్రభాకర్ కి విన్నవించడం జరిగినది. ఈ కార్యక్రమంలో డోన్ మండల అధ్యక్షులు బివై సుబ్బరాయుడు ప్రధాన కార్యదర్శి గోపాల్ ,యుటిఎఫ్ నాయకులు సుమన్, శంషాద్ బేగం, మనోహర్ తదితరులు పాల్గొనడం జరిగినది.

## తాళాలు బద్దలు కొడితే సెంటర్లు నడవవు సచివాలయాలకు తాళాలు వేస్తాం.. సీఐటీయూ





విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- డిసెంబర్ 19 సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త నిరవధిక సమ్మె డోన్ పట్టణంలో 8వ రోజు మంగళవారం కొనసాగింది. సిఐటియు జిల్లా కార్యదర్శి టి.శివరాం,ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జి.షేభారాణి, సిఐటియు పట్టణ,మండల అధ్యక్షులు నక్కీశ్రీకాంత్, పి.రామాంజనేయులు,మండల కార్యదర్శి ఏవి.భాస్కర్ రెడ్డి, ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి,అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు సులోచన,రహమద్ బి, సుమలత,నాగలక్ష్మ,గుల్జార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశంగా,దుర్మార్గంగా వ్యవహరిస్తూ అంగన్వాడి సెంటర్ల తాళాలు పగలగొట్టడం అన్యాయమని,సెంటర్లను సచివాలయాలకు అప్పగిస్తామంటే సహించమని, సచివాలయాలకు తాళాలు చేస్తామని,పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ప్రభుత్వమే శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ప్రోత్సహించడం సిగ్గుచేటు అని,సమ్మె వల్ల కలిగే పర్యవసానాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని,ప్రభుత్వం రెచ్చగొట్టే చర్యలకు తక్షణమే స్వస్తి పలికి సమ్మెను సామరస్యంగా పరిష్కరించాలని,కార్మిక వర్గం కన్నెర్ర చేస్తే రాబోవు ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం పుట్టి మునగడం ఖాయమని ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరవాలని హితవు పలికారు.జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష నేతగా ఇచ్చిన హామీలను అమలు చేయడం, అంగన్వాడీలకు తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు,సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు,మినీ వర్కర్లకు ప్రమోషన్లు,రిటైర్మెంట్ బెనిఫిట్స్ 5 లక్షలు,ఆఖరి వేతనంలో 50% పెన్షన్, హెల్పర్ల ప్రమోషన్లలో నిబంధనలు రూపొందించడం, రాజకీయ జోక్యం అరికట్టడం,ప్రమోషన్ వయసు 50 సంవత్సరాలకు పెంచడం సర్వీస్ లో ఉండి చనిపోయిన అంగన్వాడి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వడం,బీమా అమలు చేయడం,రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాలకు పెంచడం, వేతనంతో కూడిన మెడికల్ లీవ్ సౌకర్యం,వైయస్సార్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలు పెంచడం,గ్యాస్ ను ప్రభుత్వమే సరఫరా చేయడం, పెండింగ్లో ఉన్న సెంటర్ అద్దెలు, 2017 టీఏ బిల్లులు,ఇతర బకాయిలు వెంటనే చెల్లించాలని,లబ్ధిదారులకు నాణ్యమైన సరుకులు ఇవ్వాలని,వివిధ రకాల యాప్ లను రద్దుచేసి ఒకే యాప్ ద్వారా విధులు నిర్వహించే విధానం అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

## యువగళం ముగింపు సందర్భంగా.....



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- డిసెంబర్ 19 యువగలం సందర్భంగా నారా లోకేష్ ని కలిసిన డోన్ నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి జాతీయ తెలుగుదేశంపార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రతిష్టాత్మకంగా చెప్పట్టిన యువగళం పాదయాత్ర ముగింపు సందర్భంగా ఆగనంపూడి దగ్గర వారిని మర్యాదపూర్వకంగా కలిశారు అనంతరం మాజీ ఎమ్మెల్యే బిసి జనార్ధన్ రెడ్డి, నంద్యాల జిల్లా టిడిపి అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ గౌడ్, డోన్ నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి మన్నే సుబ్బారెడ్డి అంతా కలిసి సభా ప్రాంగణాన్ని పరిశీలించారు.



## సచివాలయ ఉద్యోగులు నిర్లక్ష్యం వీడండి

### రవి చంద్రా రెడ్డి మున్సిపల్ కమిషనర్



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 19-మంగళవారం మున్సిపల్ కార్యాలయం లో సచివాలయ అడ్మిన్ల తో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రవి చంద్రా మాట్లాడుతూ నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని అస్తి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులు, నీటి చార్జీలు వసూలు చేయడంలో నిర్లక్ష్యం వహించరాదని వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలను హెచ్చరించారు. వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలు ప్రతిరోజు క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించి పన్నుల వసూలలో పురోగతి సాధించాలని సూచించారు . డిసెంబర్ నెల చివరి నాటికి నిర్దేశించిన లక్ష్యాలు పూర్తయ్యే విధంగా అందరూ పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశం వార్డుల అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలు, రెవిన్యూ ఆఫీసర్ వెంకట కృష్ణ. రెవెన్యూ ఇన్స్పెక్టర్. తదితరులు పాల్గొన్నారు .

## హ్యూమన్ రైట్స్ కమిషన్ కార్యాలయం ప్రారంభం

### ముఖ్యఅతిథిగా పాల్గొన్న బ్రదర్ సిరాజుల్ రహిమాన్-



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 19-నంద్యాల పట్టణం పద్మావతి నగర్ లోని ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ కార్యాలయాన్ని ఫౌండర్ ఆఫ్ ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రెసిడెంట్ బ్రదర్ సిరాజుల్ రెహ్మాన్, నంద్యాల వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకుడు జేసిఎస్ మండల ఇన్చార్జ్ దాల్ మిల్ అమీర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు డీఎస్ హబీబుల్లాలు ప్రారంభించారు. ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ రాయలసీమ జోన్ ఇన్చార్జిగా ఎన్ఎండి ఫయాజ్ ను నియమించడం జరిగిందని బ్రదర్స్ రాజు రెహమాన్ తెలిపారు. ఈ సందర్భంగా రోమన్ రైస్ కమిషన్ ఫౌండర్ చైర్మన్ బ్రదర్ సిరాజుల్ రెహ్మాన్ మాట్లాడుతూ మైనారిటీలు విదేశాలకు పనుల కోసం వెళ్తుంటారని, అటువంటివారు అక్కడ ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ సంస్థను సంప్రదిస్తే వారిని క్షేమంగా ఇండియాకు తీసుకు వచ్చేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. అలాగే రాయలసీమ వ్యాప్తంగా ప్రజలకు ఎటువంటి సమస్యలు ఉన్నా, ప్రభుత్వ శాఖల్లో అధికారులు ఏమయినా ఇబ్బందులకు గురిచేస్తే అటువంటి వాటిని తమ దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యులు అబ్రాహాం, అంబేద్కర్, ఖాసీం, తోసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆడుదాం ఆంధ్ర.. కిట్లు పంపిణీ

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 19 -మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం కమిషనర్ రవి చంద్రా రెడ్డి ఆదేశాల మేరకు మున్సిపల్ సిబ్బంది ఆడదాం ఆంధ్ర కిట్లను సచివాలయ అడ్మిన్లకు పంపిణీ చేశారు. ఆడుదాం ఆంధ్రలో ,క్రికెట్, వాలీబాల్, ఖోఖో,కబ్బడి, బాడ్మింటన్ వంటి ఆటలు ఉంటాయని తెలిపారు. వాటికి సంబంధించిన కిట్లను సచివాలయ అడ్మిన్ల కు అందజేశారు



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190